క్లుప్తంగా...

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కును మంత్రి మల్లారెడ్డి అందజేశారు. మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన విజయలక్ష్మీకి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును మంత్రి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, సర్పంచ్ నర్మదా గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, విక్రమ్, కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావుతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును లబ్ధిదారురాలికి సోమవారం అందజేశారు. పట్టణానికి చెందిన సునీత అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమెకు రూ.60 వేలు మంజూరైంది.

ఉత్తమ ఆశా వర్కర్‌కు సన్మానం



ఘట్‌కేసర్: జిల్లాలో ఉత్తమ ఆశా వర్కర్‌గా ఎన్నికైన ఏదులాబాద్‌కు చెందిన మహాలక్ష్మితో పాటు ఇతర ఆశా వర్కర్లను ఎంపీపీ సుదర్శన్ రెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చాంబర్‌లో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సేవలు మరువలేనివని, ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మునీరాబాద్‌లో బడిబాట



మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలో సోమవారం జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామసర్పంచ్ గణేశ్, పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని నినాదాలు చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ నవనీతకు పీహెచ్‌డీ పట్టా



మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నవనీతకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా దక్కింది. ఉస్మానియా యూనివర్సిటీ ఫార్మాసుటికల్ సైన్స్ ప్రొఫెసర్ బసవరావు పర్యవేక్షణలో నిర్వహించిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ సోమవారం ఆమెకు పీహెచ్‌డీ పట్టా అందజేసింది. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యావేత్తలు ఆమెను అభినందించారు.

యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో సోమవారం బీజేపీ నాయకులు ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు హన్మంత్, సత్యం, బాలరాజ్, వినోద్, యువకులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటరు సర్వే

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. యంత్రాంగం సమాయత్తం

- ఓట్ల పరిశీలన, కొత్తగా నమోదు, దరఖాస్తుల స్వీకరణ, సవరణలు
- చేర్పులు, మార్పులు, ఆధార్ కార్డుతో ఓటరు అనుసంధానం
- అక్టోబర్ 1 వరకు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం
- అక్టోబరు 4న తుది ఓటర్ల జాబితా విడుదల



నమోదు.. పరిశీలన

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు వ్యూహరచనలతో ముందుకు సాగుతుండగా, ఎన్నికల సంఘం కూడా అందుకు అనుగుణంగా ఇంటింటా ఓట్ల పరిశీలన, కొత్త వారి నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, సవరణలు చేపట్టే కార్యక్రమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇటీవల నగరంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, సహాయ ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఆధార్ కార్డుతో అనుసంధానం వంటివి కొనసాగుతున్నాయి.

అన్ని నియోజకవర్గాల్లో బీఎల్వోలు ఈ నెల 25 నుంచి ఇంటింటా ఓట్ల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 23 వరకు కొనసాగనుంది. అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారితో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. రెండు ఓట్లు కలిగి ఉన్న వారితో మాట్లాడి ఒక ఓటు ఉండేలా దరఖాస్తు తీసుకుంటారు. చనిపోయిన వారి వివరాలు సేకరించి వాటిని తొలగించే చర్యలు చేపడతారు. ఓటు ఉండి వలస వెళ్లిన వారి వివరాలు సేకరిస్తారు. ఆధార్ అనుసంధానం చేసుకునేలా ప్రోత్సహిస్తారు.

అక్టోబరు 4న తుది ఓటరు జాబితా

అన్ని రకాలుగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి అక్టోబరు 1 నాటికి అర్హులైన వారిని జాబితాలో చేర్చడానికి కంప్యూటర్‌లో వివరాలు నమోదు చేస్తారు. వీటి ఆధారంగా ఆగస్టు 2న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. అదే నెల 2 నుంచి 31 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ మధ్యలో ఓటరు నమోదు, తొలగింపు, మార్పులపై రెండు శనివారాలు, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 22న అభ్యంతరాలపై వివరణ ఇస్తారు. అక్టోబరు 4న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు

జూలై 24 వరకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, వాటి సౌకర్యాలను పరిశీలిస్తారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓటర్లు ఉండేలా సరి చూసుకుంటారు. అవసరమైన చోట కొత్త కేంద్రాలను ఏర్పాటుకు ఫొటోలతో పాటు ప్రతిపాదనలు పంపిస్తారు.

ఆధార్, మొబైల్ నంబరు నమోదు చేయించాలి

ఇంటింటా సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పిస్తాం. ప్రతి ఓటరు ఆధార్, మొబైల్ నంబర్ నమోదు చేయించాలి. నియోజకవర్గాల వారీగా జరిగే సర్వేలో ఎన్నికల సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

\- నర్సింహారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి.

రాష్ట్రంలో వెలుగులు నింపిన కేసీఆర్

మంత్రి మల్లారెడ్డి



20వ వార్డులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తూ..



గోధుమకుంటలో విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి

మేడ్చల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ విద్యుత్ రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో వెలుగులు నింపారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖా నిర్వహించిన నియోజకవర్గ విద్యుత్ ప్రగతి సమావేశంలో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోతలతో రైతులు, పరిశ్రమలవారు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక కరెంట్ అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో రాష్ట్రం అన్నపూర్ణగా మరిందన్నారు. నాణ్యమైన కరెంట్ సరఫరాతో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని అన్నారు. విద్యుత్ సంస్థల్లో కిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగి వరకు శ్రమించడంతోనే విద్యుత్ ప్రగతి సాధ్యమైందన్నారు.

అట్టహాసంగా దశాబ్ది ఉత్సవాలు..

విద్యుత్ శాఖా విద్యుత్ ప్రగతి పేరుతో దశాబ్ది ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో మేడ్చల్‌లో సదస్సు ఏర్పాటు చేసి తమశాఖ నియోజకవర్గంలో చేస్తున్న ప్రగతి నివేదించారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నర్సింహారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి ఎస్ఈ శ్రీరాంమోహన్, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈలు సత్యనారాయణరాజు, రమణారెడ్డి, ఏఈలు పవన్‌చంద్, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయం ప్రారంభోత్సవం..

మేడ్చల్ పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మేడ్చల్ ఏసీపీ కార్యాలయాన్ని మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. 20వ వార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను పోలీస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. మేడ్చల్ డీసీపీ గోనె సందీప్‌రావు, ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజావిజయానందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్‌లు దీపికనర్సింహరెడ్డి, లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో గణనీయమైన ప్రగతి

కీసర: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ విద్యుత్ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు మంచాల కిరణ్‌జ్యోతిప్రవీణ్, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ పగ్రతి సమావేశంలో జాతీయ జెండా ఆవిష్కరణలో మంత్రి మల్లారెడ్డి



స్వామివారిని దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి, స్థానిక నాయకులు

జగ్గంగూడలో బీరప్ప కల్యాణం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో బీరప్ప కామరాతి కల్యాణం సోమవారం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ యెళ్ళుబాయి, జెడ్పీటీసీ అనిత, స్థానిక సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణలో భాగంగా పట్టణంలో ఉపాధి పనులు కల్పించాలని, పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ప్రజా పోరాటాలను ఉధృతం చేయనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తలు ధర్నాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ ఎత్తివేయాలని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా చట్ట ప్రకారం రూ.272 చెల్లించాలని, రోజు కూలి రూ.600లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కూలీలు రెండుసార్లు ఫొటోలు అప్‌లోడ్ విధానాన్ని రద్దు చేసి, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించి పనిముట్లు, ఆటో చార్జీలు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, నేతలు కృష్ణమూర్తి, మహాలక్ష్మి, స్వరూప, జంగయ్య, యాదగిరి, సల్మాన్ బేగ్, రాములు గౌడ్, రవి, నాగేష్, ఇమ్రాన్, అండాలు, భాగ్య, మల్లికా పాల్గొన్నారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు వినతి పత్రం సమర్పించారు.

దాడి చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి



జాతీయ మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేస్తూ..

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో తనపై దాడి చేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, చేయించిన మంత్రిపై చర్యలు తీసుకోవాలని అంకుషాపూర్ ఎంపీటీసీ శోభారాణి, భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు మాలతితో కలిసి ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ సోమవారం ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని కోరితే స్థానిక మంత్రి బీఆర్ఎస్ మహిళా మేయర్, ఎంపీపీలతో తనపై దాడి చేయించారని, కలెక్టర్, అదనపు కలెక్టర్ సమక్షంలో దాడి జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారు, చేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

చెరువుల పండగను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈనెల 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో వేయి మందితో సభను ఏర్పాటు చేయాలని, ఇందులో రైతులతో పాటు ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొనాలన్నారు. 7న కీసర మండలంలో చీర్యాలలోని నాటికన్ చెర్వు, దుండిగల్ పెద్ద చెరువు, గండిమైసమ్మ చెరువుల వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 8న ఊరూరా చెరువుల పండగ కార్యక్రమం భాగంగా చెరువుల పండగను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. చెరువుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఊరూర చెరువుల పండుగ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. గ్రామ దేవతలకు పూజలు నిర్వహించడం, బతుకమ్మ, కోలాటం, బోనాలు, రంగవళ్లులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చెరువులను అందమైన పూలతో అలంకరించాలని అధికారులకు సూచించారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లు, వలంటీర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి చెరువు వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలో మాధవరెడ్డి చౌరస్తాను అభివృద్ధి చేసేందుకు నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులను జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన వ్యాపారుల సహాయంతో చేపడుతున్న పనులను ఆయన ప్రారంభించి అభివృద్ధి పనుల్లో భాగస్వాములైన వ్యాపారులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



గౌడవెల్లి గ్రామంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న హరివర్ధన్‌రెడ్డి

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

కీసర: ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టి చాకిరీ చేయిస్తూ కనీస వేతనాలను అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలను అందజేయాలని కోరుతూ సోమవారం కీసర పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్యకేంద్రం) వద్ద ధర్నా ఆశా వర్కర్లు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆశ వర్కర్లు మాట్లాడుతూ 2006 నుంచి తాము పనిచేస్తున్నామని, ఎంతో కష్టపడుతున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదన్నారు. తమకు కనీస వేతనం అందజేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు.



కీసర పీహెచ్‌సీ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

విద్యార్థుల కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

అనురాగ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రామచంద్రం



టాప్ ర్యాంకర్లతో వైస్ చాన్స్‌లర్ రామచంద్రం, సీఈవో నీలిమా తదితరులు

ఘట్‌కేసర్: ఔత్సాహిక ఇంజినీర్లు నూతన సాంకేతికను దృష్టిలో ఉంచుకొని కోర్సులు ఎంపిక చేసుకోవాలని, విద్యార్థుల కృషితో ఉత్తమ ఫలితాలు సాధ్యమని అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) వైస్ చాన్సలర్ రామచంద్రం అన్నారు. సోమవారం వెంకటాపూర్ ఏయూలో అనురాగ్-23 సెట్ ఫలితాలు విడుదల చేసిన అనంతరం మొదటి 10 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.6.5 కోట్ల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సీఈవో నీలిమా మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను సమాజానికి అందించాలనే లక్ష్యంగా యూనివర్సిటీలో నాణ్యమైన విద్యతో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మొదట ప్రవేశం పొందిన 500 మంది విద్యార్థులకు అర్హత ఆధారంగా ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అనురాగ్ పల్లా, అనురాగ్ సెట్-23 కన్వీనర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ముత్తారెడ్డి, డీన్ సుధీర్‌రెడ్డి, అకాడమిక్స్ డీన్ విజయకుమార్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడొద్దని ప్రతిజ్ఞ



ఘట్‌కేసర్‌లో మొక్క నాటుతున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి

మేడ్చల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్‌లో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడొద్దని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కమిషనర్ త్రిలేశ్వర్ రావు, కౌన్సిలర్ మహేష్, కో ఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్, ఆర్‌ఓ రాంచందర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి..

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఆవరణలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేనేజర్ అంజిరెడ్డి, కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, ఆంజనేయులుగౌడ్, నాయకులు సిరాజ్, విజయ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కీసర: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగారం మున్సిపాలిటీ 17వ వార్డులో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాగారం మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు తెలిపారు. అనంతరం రవీంద్రనగర్ కాలనీలో నిర్వహించిన ఆర్.ఆర్.ఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల సెక్రటరి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



ఘట్‌కేసర్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని సోమవారం ఉదయం ఓ కారు ఢీకొట్టగా అతడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(50-55) రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ రాయదుర్గం ప్రశాంత్‌హిల్స్‌కు చెందిన శ్రీపతి సతీశ్‌కుమార్(37) కారుతో వేగంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ఆ వ్యక్తి మృతి చెందాడు. యానంపేట్ వీఆర్‌ఏ సత్యానాయక్ ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమాచారం తెలిసిన ఘట్‌కేసర్ ఎస్‌లో సంప్రదించాలన్నారు.



సెయింట్ పీటర్స్‌లో పరిసరాలను శుభ్రం చేస్తూ..



నాగారంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి